సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్: గురుకుల పాఠశాలలకు రూ.170 కోట్ల విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాచారంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యుడి మృతి



పీఆర్.నాగరాజు (ఫైల్)

మల్లాపూర్: మల్లాపూర్‌కు చెందిన మాజీ వార్డు సభ్యుడు పీఆర్. నాగరాజు (49) అనారోగ్యంతో మృతి చెందాడు. మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ సలహాదారుడిగా, నందీశ్వరాలయం ప్రధాన కార్యదర్శిగా, టీడీపీ. బీఆర్ఎస్‌లో పనిచేశారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీజేపీ నేత తూళ్ల వీరేందర్‌గౌడ్ నాగరాజు భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అంతిమయాత్రలో ప్రజా, కుల సంఘాలు ప్రతినిధులు, కాలనీవాసులు, శాంతి యూత్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ

మల్కాజిగిరి: మొహర్రం, బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ సూచించారు. మల్కాజిగిరిలో ఫలహారం బండ్లు, ఆలయ నిర్వాహకులు, మైనార్టీ సోదరులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ విభాగంతో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ర్యాలీ సమయంలో ఇతరులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్వాల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయని నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపారు. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో సింహాద్రినగర్ కాలనీవాసులకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతను గురువారం వివరించారు. పోలీసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులకు ఉచిత శిక్షణ

బోడుప్పల్: చెంగిచర్లలోని జాతీయ మాంస పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో మాంసం దుకాణదారులకు జంతువులు, కోళ్ల వధపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి. రామకృష్ణ తెలిపారు. గురువారం చెంగిచర్లలో ఆయన మాట్లాడుతూ.. భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రకారం మాంసం కోసం జంతు వులు, కోళ్లను వధించే ముందు వాటిని స్టన్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనైతికంగా మాంస, కోళ్ల దుకాణదారులు కటింగ్ చేస్తున్నారన్నారు. మంసాన్ని శుభ్రం చేసేందుకు పరిశుభ్రమైన నీరు వాడాలని, బ్యాక్టరీయ, వైరస్, ప్యారాసైట్స్, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పేరు, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌తో 9247285278 వాట్సాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి



మల్కాజిగిరి: నియోజకవర్గంలోని నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మను చౌదరిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు సునీతాయాదవ్, విజయశాంతిరెడ్డి, నాయకులు పరశురామిరెడ్డి, రాముయాదవ్, అనిల్ కిశోర్ గౌడ్, డోలి రమేశ్, ఉస్మాన్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'..!

రద్దీగా నాచారం టూ మల్లాపూర్ ప్రధాన రహదారి

- నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతం
- ఇబ్బందుల్లో వాహనదారులు



నాచారం నుంచి హబ్సిగూడ వెళ్లేదారిలో వాహనాలు

మల్లాపూర్: హబ్సిగూడ టూ నాచారం మల్లాపూర్ ప్రధాన రహదారి ట్రాఫిక్‌కు నిలయంగా మారుతోంది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై పారిశ్రామికవాడ మరోవైపు విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు ఉండడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. దీంతో ప్రధాన రహదారిపై గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి.

బాటిల్‌నెక్‌తో ఎన్‌జీఆర్ఐ ప్రహరీ..

నాచారం నుంచి హబ్సిగూడ వెళ్లేదారి ఐఐసిటి బాటిల్‌నెక్‌గా ఉండడంతో హబ్సిగూడ సిగ్నల్ పడితే అర కిలోమీటర్ వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో ఉదయం ఉద్యోగులు, విద్యార్థులు సకాలంలో వెళ్లలేకపోతున్నారు.



ఐఐసీటీ గోడను విస్తరించాలని కేంద్రమంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి (ఫైల్)

ఉదయం, సాయంత్రం వేళల్లో...

నాచారం,మల్లాపూర్ నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్, ఎస్ఎఫ్‌సీ ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వందల వాహనాలు ఈ దారి గుండా వెళ్తుంటాయి. మరోవైపు ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో బస్సులు వెళ్లేందుకు వీల్లేక ట్రాఫిక్ నిలిచిపోతోంది.

స్కూల్ హబ్‌గా నాచారం..

నాచారంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సుప్రభాత్, అకాడమీ హైట్స్, జాన్సన్ గ్రామర్ స్కూల్, సెయింట్ పీటర్స్ స్కూల్, డక్కన్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన బస్సులతో నిత్యం రద్దీగా మారుతోంది. దీంతోపాటు ఆర్టీసీ బస్సులు ఈ రహదారిపై నడుస్తుండడంతో ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు నాచారం హెచ్‌ఎంటీనగర్ వద్ద ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పారిశ్రామికవాడకు ప్రధాన రహదారి

ఈఎస్ఐ ఆస్పత్రి, ఎస్ఎఫ్‌సీ, ఈసీఐఎల్, మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, పారిశ్రామికవాడ, చర్లపల్లి జైలు, చర్లపల్లి రైల్వేస్టేషన్ వెళ్లే వాహనాలు, ఐఓసీఎల్, బీపీసీఎల్ డీజిల్, పెట్రోల్ ట్యాంకర్లు ఈదారి గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. ఐఐసీటీ గోడ వద్దకు రాగానే ట్రాఫిక్ ఆగిపోతోంది. దీంతో ప్రతిఒక్కరూ 15 నిమిషాల నుంచి అరగంట పాటు ట్రాఫిక్‌లోనే ఇర్కుకు పోవాల్సిందే.

రోడ్డు విస్తరించాలని కేంద్రమంత్రికి ఎమ్మెల్యే వినతి

నాచారం నుంచి హబ్సిగూడకు వెళ్లే రహదారిలో ఐఐసీటీ క్వార్టర్స్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉందని దీంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోందని రోడ్డును విస్తరించాలని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్‌కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



నాచారం నుంచి హబ్సిగూడ వెళ్లే దారి ఐఐసిటి గోడ బాటిల్‌నెక్‌లాగా ఉంది. దీంతో భారీ వాహనాలు, స్కూల్ బస్సులు ఒక్కసారిగా వచ్చినప్పుడు ట్రాఫిక్ గంటల కొద్ది నిలిచిపోతోంది. ఐఐసిటి గోడను విస్తరించాలని పలుమార్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో ట్రాఫిక్, ఐఐసిటి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–శాంతి సాయిజెన్ శేఖర్,నాచారం కార్పొరేటర్

నాచారం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం డివిజన్‌లో రూ.75 లక్షల వ్యయంతో సావర్కర్‌నగర్, ఎరుకలబస్తీ, శ్రీరామ్‌నగర్, వీఎస్టీ కాలనీలో స్థానిక కార్పొరేటర్ శాంతితో కలిసి సీసీ రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటేల్‌కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించి చెరువులోకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వినీత్, వర్క్ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సభ

మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జడ్పీ పాఠశాల బయో సైన్స్ ఉపాధ్యాయుడు మారోజు కృష్ణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా యంకన్‌వెన్షన్ హాల్‌లో గురువారం సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హాజరై కృష్ణయ్యను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి తదితరులు

ఎడవల్లి రఘువర్ధన్ రెడ్డి, నాయకులు జావిద్ ఖాన్, ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఓరియంటేషన్'



ఉప్పల్: ఉప్పల్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.గీత సిబిసిఎస్ విధానం, టైంటేబుల్, అకాడమిక్ కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. దోస్త్ కోఆర్డినేటర్ జె. విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ.. కళాశాలలో సీటు లభించని వారు నాలుగో ఫేజ్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రమ శిక్షణ తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. రవి ప్రసాద్ పాల్గొన్నారు.

అల్వాల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్‌ను సిటీ సెక్యూరిటీ విభాగానికి బదిలీ అయ్యారు. గురువారం సైబరాబాద్ కమిషనర్ వెల్లడించిన ఉత్తర్వుల మేరకు సీసీఎస్ రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న ఏ.ప్రశాంత్ అల్వాల్ ఇన్‌స్పెక్టర్‌గా రాహుల్‌దేవ్ స్థానంలో ఇక్కడికి వచ్చారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. డీఈ అన్వర్‌పాషా, ఏడీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల సీఎండీని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. సఫిల్‌గూడ పార్క్ వద్ద 33 కేవీ లైన్ షిఫ్టింగ్, కొత్త స్పెన్సర్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారన్నారు. పలు ప్రాంతాల్లో తొలగించిన స్తంభాలను అక్కడే ఉంచడం వలన శానిటేషన్ సమస్యలు వస్తున్నాయని వాటిని తొలగించాలని



విద్యుత్ శాఖ అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్రవణ్

సూచించామన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏఈలు శ్రీనివాస్, సుమన్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం

బోడుప్పల్: హైదరాబాద్‌లో ఈనెల 4న జరగనున్న ఆత్మీయ సమ్మేళనంపై మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వం గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురు బాల కార్మికులకు విముక్తి

కుషాయిగూడ: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గురువారం నలుగురు బాల కార్మికులకు విముక్తి కల్పించారు. కుషాయిగూడ పోలీసులు, మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు, సీడబ్ల్యూసీ ప్రతినిధులు సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించి వివిధచోట్ల పనుల్లో ఉన్న బాల కార్మికులను గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించి పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులను సీడబ్ల్యూసీ ఎదుట ప్రవేశపెట్టి వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉప్పల్: గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట ప్రాంతానికి చెందిన కాట్రావత్ నరేశ్ (27) వ్యక్తిగత కారణాల వల్ల 3 రోజుల క్రితం ఉప్పల్ బగాయత్‌లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని ఓవైసీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరిట మోసం చేసిన వ్యక్తి రిమాండ్



దాసరి మహేందర్

మల్లాపూర్: ప్రేమ పేరిట యువతిని మోసం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దాసరి చంద్రయ్య కుమారుడు మహేందర్ అలియాస్ డాంగ్లి మహేశ్ (28) నాచారానికి చెందిన (19) ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో ప్రలోభపెట్టి బలవంతంగా లైంగిక సంబంధం పెట్టుకున్నాడు. ఆ యువతి గర్భం దాల్చింది. వివాహం చేసుకోమని అడగగా తనకు పెళ్లి అయిందని ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపాడు. దీంతో మోసం పోయానని తెలుసుకున్న యువతి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసిన నాచారం పోలీసులు దాసరి మహేందర్‌ను అరెస్ట్‌చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మహేందర్ గంజాయి, ఇతర కేసుల్లోనూ నిందితుడని సీఐ తెలిపారు.

యూఎల్‌సీ సమస్యను పరిష్కరించండి

గౌతంనగర్: మల్లికార్జుననగర్‌లో పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ (యూఎల్‌సీ) సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1978లో మల్లికార్జునగర్‌లో కొందరు యూఎల్‌సీలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి, బీఆర్ఎస్ నాయకులు



జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్, కాలనీవాసులు

మేకల రాముయాదవ్, భైరు అనిల్, మల్లికార్జుననగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతరావు, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కాలనీ మహిళలు

మౌలాలి : పిల్లినర్సింగరావు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు మహిళలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోర్‌వెల్ మరమ్మతులు చేయించాలని, సింగిల్ ఫేజ్ నుంచి ట్రిపుల్ ఫేజ్‌కు విద్యుత్‌ను మార్చాలని, అలాగే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారని వారు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 5 కోట్లతో ప్రతిపాదనలు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో రూ.5 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చర్లపల్లి గ్రేవ్‌యార్డ్ పనులపై ఆరా తీశారు. నాగర్జుననగర్, లోకమాతకాలనీ, చర్లపల్లి, చిన్న చర్లపల్లి, ఐజీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, విద్యామారుతీనగర్, కుషాయిగూడ, ఇంద్రానగర్‌తో పాటుగా పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలను డీఈ బాలకృష్ణకు అందజేశారు. సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిపాదనల కాపీని అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత, కాలనీవాసులు

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సునీత మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పీబీకాలనీ, ద్వారకమాయి కాలనీ ఫేజ్-2, నెహ్రూనగర్, గోకుల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పవర్‌బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పవర్‌బోర్లు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారని ఆమె తెలిపారు. కాలనీవాసులు, బీజేపీ నాయకులు గోపాల్‌గౌడ్, బీరప్ప, మల్లేశ్వరరావు, గుప్తా, శంకర్, శివగౌడ్, శ్రీనివాసయాదవ్, నటరాజ్, బబిత, లలిత, రేఖ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ జెండా ఆవిష్కరణ

మేడిపల్లి: మండలకేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జెండాను గురువారం ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు పరునంది వేంకార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రేడపాక కమల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపనకోసం పోరాడుతున్న ఏకైక పార్టీ ధర్మసమాజ్ పార్టీ అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సుమారుగా 1200 మంది ప్రాణత్యాగాలు చేశారని అందులో రెడ్డి, వెలమలు లేరని ఆరోపించారు. త్యాగాలు బడుగు బలహీన వర్గాలది, భోగాలు అగ్రవర్ణాలదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మనకోసం పోరాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకత్వంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మదన్, నవీన్‌కుమార్, బాలరాజు, సురేశ్, ప్రభాకర్, జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బోనాలకు రండి

కుషాయిగూడ: బోనాలకు హాజరు కావాలని కోరుతూ పోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్ యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



బొంతు శ్రీదేవికి ఆహ్వానపత్రికను ఇస్తున్న ప్రతినిధులు

'స్థానికం'లో మెజార్టీ సీట్లు సాధించాలి



రాంచందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం



రాంచందర్‌ను సత్కారిస్తున్న రాగిరి మోహన్‌రెడ్డి


రామంతాపూర్ : రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన నారప్ప రాజు రాంచందర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి గురువారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జగన్‌యాదవ్, శాగ రవీందర్, సంతోష్ గుప్తా పాల్గొన్నారు.

నాచారం డివిజన్ నాయకులు..

మల్లాపూర్: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావును నాచారం డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కారించారు. మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్‌రెడ్డి, వీఎస్ ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, దయాగౌడ్, ప్రతాప్‌రెడ్డి, రవీకాంత్, తదితరులు ఉన్నారు.

మౌలాలి కార్పొరేటర్ ..

మౌలాలి : మౌలాలి కార్పొరేటర్ సునీత నాయకులు, కార్యకర్తలు, తన అనుచరులతో కలిసి తార్నాకలోని ఆయన నివాసంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మౌలాలి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శివగౌడ్, నాయకులు జగదీశ్ యాదవ్, భరత్ భూషణ్‌యాదవ్, మురళి, కిరణ్, శ్రీనివాసయాదవ్, వెంకటేశ్, బబిత, లలిత, రేఖ, వెంకటరమణ, నటరాజ్, రమణ, మోహనరావు, రామకృష్ణ, మంజునాథ్, మధుసూదన్, అనిల్‌కుమార్, రోహిత్, సాయి, రమేశ్, జగదీష్ పాల్గొన్నారు.



మౌలాలి కార్పొరేటర్ సునీత తదితరులు